సాక్షి
నల్లగొండ

శుక్రవారం । 3 । మార్చి । 2023



హక్కులను కాపాడుకుందాం

రాజ్యాంగ హక్కులను కాపాడుకుందామని సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యురాలు బృందాకరత్ పిలుపునిచ్చారు. - 10లో



రసాయన శాస్త్రానిదే భవిష్యత్

రసాయన శాస్త్రానికి ఉజ్వల భవిష్యత్ ఉందని సీఎస్ఐఆర్ ఐఐసీటీ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. - 10లో

వాతావరణం

గరిష్టం/కనిష్టం 36°/17°

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

నేడు బీఆర్‌ఎస్ ధర్నా

- హాజరుకానున్న మంత్రి జగదీశ్‌రెడ్డి

నల్లగొండ: కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్ ధరలకు నిరసనగా శుక్రవారం నల్లగొండలోని గడియారం సెంటర్‌లో బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించనున్నట్టు ఆ పార్టీ వర్గాలు తెలిపాయి. ఈ కార్యక్రమానికి రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డితోపాటు జిల్లా పరిషత్ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి, నల్లగొండ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి హాజరు కానున్నారు. వీరితోపాటు నియోజకవర్గంలోని ముఖ్య నాయకులు, మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు తతదితరులు పాల్గొనున్నారు.

రేపు పోలీస్ కార్యాలయంలో పాత సామగ్రి వేలం

నల్లగొండ క్రైం: జిల్లా పోలీస్ కార్యాలయంలో పాత సామగ్రిని శనివారం (ఈనెల 4వ తేది) ఉదయం 10 గంటలకు వేలం వేస్తున్నట్లు ఎస్పీ అపూర్వరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వేలం వేసేవాటిలో పాత టెంట్లు, ఐటీ విభాగానికి చెందిన కంప్యూటర్లు, ఫర్నిచర్, ఐరన్ రీడింగ్ చైన్లు, కార్పెట్లు, హెల్మెంట్లు, ప్రింటర్లు తదితర వస్తువులు ఉన్నట్లు పేర్కొన్నారు. పూర్తి వివరాలకు వెల్ఫేర్ ఆఫీసర్ సంతోష్ సెల్ : 8774898080 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

'మన బడి' పనులు వేగవంతం చేయాలి



పాఠశాలను పరిశీలిస్తున్న డీఈఓ భిక్షపతి

మునుగోడు: మనఊరు–మనబడి ప్రణాళికలో భాగంగా పాఠశాలల్లో చేపడుతున్న అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని డీఈఓ భిక్షపతి అన్నారు. గురువారం మునుగోడులోని ప్రాథమిక పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనఖీచేసి మనబడి పనులు పరిశీలించి మాట్లాడారు. జూన్ నాటికి పనులన్నీ పూర్తి చేయాలన్నారు. ఆయన వెంట పాఠశాల హెచ్‌ఎం భిక్షపతి, పీఆర్ ఏఈ రామకృష్ణ ఉన్నారు.

వైఎస్సార్ తెలంగాణ పార్టీ కోఆర్డినేటర్ల నియామకం

నల్లగొండ: వైఎస్సార్ తెలంగాణ పార్టీ అసెంబ్లీ నియోజకవర్గాలకు కోఆర్డినేటర్లు నియమితులయ్యారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని నియోజకవర్గాలకు కూడా కో ఆర్డినేటర్లను నియమించారు. నల్లగొండ నియోజకవర్గానికి కె.గోవర్ధన్, మునుగోడుకు వనమాల పరమేష్ కుమార్, నాగార్జునసాగర్‌కు రమావత్ స్వామి నాయక్, మిర్యాలగూడకు ఇంజం నర్సిరెడ్డి, హుజూర్‌నగర్‌కు జె.వెంకటేశ్వర్లు, కోదాడకు పచ్చిపాల వేణు, సూర్యాపేటకు పిట్టా రాంరెడ్డి, తుంగతుర్తికి ఏపూరి సోమన్న, ఆలేరు నియోజకవర్గానికి గ్యారా నగేష్, దేవరకొండకు సరోజ్‌రెడ్డిలను కోఆర్డినేటర్లను నియమిస్తూ పార్టీ అధినేత్రి వైఎస్ షర్మిల తాజాగా ఉత్తర్వులు జారీ చేశారు.

సదస్సుకు తరలిరండి

నల్లగొండ రూరల్: మిలియన్ మార్చ్ స్ఫూర్తితో ఈనెల 10న హైదరాబాద్‌లో నిర్వహించే తెలంగాణ బచావో సదస్సుకు భారీగా తరలి వచ్చి విజయవంతం చేయాలని టీజేఎస్ జిల్లా అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి కోరారు. ఈ మేరకు రూపొందించిన పోస్టర్‌ను గురువారం నల్లగొండలో ఆవిష్కరించి మాట్లాడారు. రాష్ట్రం వచ్చిన తర్వాత రిటైర్మెంట్‌లే తప్ప కొత్తగా రిక్రూట్‌మెంట్లు లేవని అన్నారు. ధనిక రాష్ట్రాన్ని అప్పుల పాలు చేశారని, ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేని స్థితికి తీసుకొచ్చారని ప్రభుత్వాన్ని విమర్శించారు.

విధి నిర్వహణలో నిర్లక్ష్యం వద్దు



దామరచర్లలో మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ

మిర్యాలగూడ, అడవిదేవులపల్లి: విధుల నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని జెడ్పీ సీఈఓ ప్రేమ్‌కరణ్‌రెడ్డి హెచ్చరించారు. గురువారం దామరచర్ల మండలం కొండ్రపోల్ గ్రామంలోని నర్సరీని సందర్శించి మాట్లాడారు. అనంతరం మిర్యాలగూడ, అడవిదేవులపల్లి ఎంపీడీఓ కార్యాలయాల్లో అధికారులతో సమావేశమై ఉపాధి హామీ పనులపై సమీక్షించారు. ఈ కార్యక్రమాల్లో ఆయా మండలాల ఎంపీడీఓ కృష్ణమూర్తి, మహ్మద్ షరీఫ్, జెడ్పీటీసీ ఆంగోతు లలితహతీరాంనాయక్, ఎంపీపీ నందినిరవితేజ, అడవిదేవులపల్లి సర్పంచ్ కొత్త మర్రెడ్డి, ఏపీఎం ఝాన్సీ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

- గ్యాస్ ధర పెంపుపై నిరసన



కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్ ధరలను నిరసిస్తూ కనగల్‌లో నిర్వహించిన ధర్నాలో మాట్లాడుతున్న నల్లగొండ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి



నార్కట్‌పల్లిలో బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి రాస్తారోకో నిర్వహిస్తున్న ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య, జెడ్పీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి

'ఉపాధి'లో అక్రమాలు

పశువుల షెడ్లు కట్టకున్నా.. నిర్మించినట్లు నివేదికలు

- మండల అధికారులు, సిబ్బందితో అక్రమార్కుల కుమ్మక్కు
- విచారణ నివేదిక ఇచ్చినా చర్యలు చేపట్టడంలో జాప్యం
- రాజకీయ ఒత్తిళ్లతోనే పట్టించుకోని అధికారులు
- చందంపేటలో సోషల్ ఆడిట్‌కు సహకరించని అధికారులు, సిబ్బంది

ఉపాధి హామీలో అక్రమాలు బయటపడ్డాయి. చేయని పనులు చేసినట్లు నివేదికలు ఇవ్వడంతోపాటు నిధులు డ్రా చేశారు. అంతేకాదు ఒక గ్రామంలో పనులు చేసినట్లు చూపించి.. మరో గ్రామం పేరుతో బిల్లులు ఎత్తేశారు. చందంపేట మండలంలో జరిగిన ఈ తతంగం వెలుగులోకి రాకుండా చేసేందుకు.. ఉపాధి హామీ పనులపై నిర్వహిస్తున్న సోషల్ ఆడిట్‌కు అధికారులు సహకరించడం లేదు. రికార్డులను ఇచ్చేందుకు ఇప్పటికే రెండుసార్లు గడువు కోరడంతో ఆ మండలంలో సోషల్ ఆడిట్ ఆగిపోయింది. మిగతా మండలాల్లోనూ సోషల్ ఆడిట్ పూర్తయితే పెద్ద ఎత్తున అక్రమాలు వెలుగులోకి రానున్నాయి.

సాక్షి ప్రతినిధి నల్లగొండ: కేంద్ర ప్రభుత్వం వలసలు నివారించేందుకు గ్రామస్థాయిలో గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని ప్రవేశపెట్టింది. గ్రామాల్లో కూలీలు వలస వెళ్లకుండా ఊళ్లోనే ఉపాధి కల్పించేందుకు ఈ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తోంది. ప్రతి ఏటా గ్రామాల్లో చేసిన ఉపాధి హామీ పనులకు సంబంధించి సోషల్ ఆడిట్ నిర్వహించాల్సి ఉంది. కరోనా వ్యాప్తి కారణంగా రెండేళ్లపాటు సోషల్ ఆడిట్‌లో జాప్యం చోటు చేసుకుంది. ఇటీవల ఆ ప్రక్రియను చేపట్టగా అక్రమాలు బయటికి వస్తాయనే భయంతో కొందరు అధికారులు, సిబ్బంది అందుకు సహకరించడం లేదు. 2019 అక్టోబర్ 10వ తేదీ నుంచి 2022 మార్చి 31 వరకు గ్రామాల్లో చేపట్టిన ఉపాధి హామీ పనులపై సోషల్ ఆడిట్ కొనసాగుతోంది.



చందంపేటలో ఉపాధి హామీ రికార్డులను తనిఖీ చేస్తున్న ఎంపీడీఓ రాములు నాయక్

పశువుల పాకలు నిర్మించకుండానే బిల్లులు డ్రా..

చందంపేట మండలంలో కొన్ని పనులు చేయకుండానే బిల్లులు డ్రా చేశారు. ముడుదండ్ల గ్రామ పంచాయతీ పరిధిలో పనులు చేయగా, కోరుట్ల గ్రామ పంచాయతీ కింద నిధులను డ్రా చేశారు. మొత్తం మండలంలో ఉపాధి హామీ కింద 12 పశువుల పాకలు మంజూరు అయ్యాయి. ఒక మేకలు, గొర్రెల పాక కూడా మంజూరైంది. 12 పశువుల పాకలకు సంబంధించి 9 పనులు పూర్తయ్యాయని, వాటికి సంబంధించిన కూలీలకు డబ్బులు చెల్లించినట్లు రికార్డు చూపారు. మిగిలిన 3 షెడ్లు నిర్మాణం చేపట్టలేదు. సంబంధిత సిబ్బంది మాత్రం నిర్మాణాలు పూర్తయినట్లు మెజర్‌మెంట్ బుక్‌లో (ఎంబీ) రికార్డు చేసి బిల్లులు డ్రా చేశారు. గ్రామ పంచాయతీ తీర్మానంలో ఆ మూడు పనులు చేసినట్లుగా లేదు. అయితే మండల కార్యాలయంలో మాత్రం ముగ్గురి పేర్లను రాసి నిధులను డ్రా చేశారు. మరోవైపు అధికారులు వీటికి సంబంధించిన ఓ పశువుల పాక వద్దకు వెళ్లి పరిశీలించగా.. రెండు షెడ్లను రైతులు 9 ఏళ్ల కిందటే వాటిని సొంతంగా నిర్మించుకున్నట్లు తేలింది. మరొకటి మంజూరు ఒక వ్యక్తి పేరుపై కాగా, మరో వ్యక్తి భూమిలో కట్టినట్లు చూపించారు. ఇలా షెడ్లు నిర్మించకుండానే డబ్బులు డ్రా చేసినట్లు బట్టబయలైంది.

గ్రామ పంచాయతీ తీర్మానం లేకుండానే..

చందంపేట మండలంలో రాక్ ఫిల్ డ్యాం (ఆర్ఎఫ్‌డీ) నిర్మాణానికి రూ.10.13 కోట్ల పనులు మంజూరయ్యాయి. అందులో ముడుదండ్ల గ్రామ పంచాయతీలో 8 రాక్‌ఫిల్ డ్యాంలు, 5 గులకరాళ్ల కట్టడాలు కట్టినట్లు రికార్డు చేశారు. ఆ పనులను గ్రామ పంచాయతీ తీర్మానం లేకుండానే మంజూరు చేయించారు. పైగా ఆ పనులను ఆ గ్రామంలో చేపట్టినట్లు కాకుండా, కోరుట్ల గ్రామ పంచాయతీలో పూర్తి చేసినట్లు రికార్డులు రాసి బిల్లులు ఎత్తేశారు. ఉన్నతాధికారుల తనిఖీల్లోనే ఈ అక్రమాల వ్యవహారం బయట పడింది. కొందరు అధికారులు, సిబ్బంది పనులు చేసిన వారితో కుమ్మక్కై బిల్లులు డ్రా చేసినట్లు తెలిసింది.

రాజకీయ ఒత్తిళ్లతో చర్యలు శూన్యం..

ఉపాధి హామీ పనుల్లో జరిగిన ఈ అక్రమాలపై డీఆర్‌డీఏ అదనపు ప్రాజెక్టు డైరెక్టర్ నేతృత్వంలోనే విచారణ జరిగింది. అక్రమాలు జరిగినట్లు నిగ్గు తేల్చారు. గత ఏడాది నవంబరు 22వ తేదీ నాడే ఆయన తన నివేదికను జిల్లా ఉన్నతాధికారులకు అందజేశారు. ఇప్పటివరకు ఎలాంటి చర్యలు చేపట్టలేదు. ఈ వ్యవహారంలో ఎలాంటి చర్యలూ చేపట్టవద్దని దేవరకొండ ప్రాంతానికి చెందిన ఓ ముఖ్య ప్రజా ప్రతినిధి అధికారులపై ఒత్తిడి చేస్తున్నట్లు తెలిసింది. పనులు చేయకుండానే బిల్లులు డ్రా చేసిన వారు అధికార పార్టీకి చెందిన వారు కావడంతోనే వారిపై చర్యలు చేపట్టకుండా అధికారులు మిన్నకుండిపోతున్నారన్న చర్చ సాగుతోంది. మరోవైపు ఈ వ్యవహారాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లిన వారిపైనా కక్ష సాధింపు చర్యలకు పాల్పతున్నట్లు తెలిసింది. పైగా సోషల్ ఆడిట్‌కు సహకరిస్తే మరిన్ని అక్రమాలు బయట పడతాయనే భయంతోనే సోషల్ ఆడిట్‌కు ఫైళ్లు ఇవ్వకుండా జాప్యం చేస్తున్నట్లు సమాచారం.

'డబుల్' ఇళ్లకు నేడు లక్కీ డ్రా

- 4,205 మంది అర్హులుగా గుర్తింపు
- 12 ఫంక్షన్ హాళ్లలో డ్రా

నల్లగొండ: నల్లగొండ పట్టణంలో డబుల్ బెడ్‌రూం ఇళ్లకు అధికారులు శుక్రవారం లక్కీ డ్రా నిర్వహిస్తున్నారు. ఇప్పటికే పట్టణంలోని కలెక్టరేట్ వెనుక ప్రాంతంలో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లకు సంబంధించి అధికారులు దరఖాస్తులు ఆహ్వానించారు. దీంతో మున్సిపల్ పరిధిలోని 48 వార్డులకు చెందిన మొత్తం 13,230 మంది దరఖాస్తులు చేసుకున్నారు. ఇందులో భాగంగా 4 రోజుల నుంచి రెవెన్యూ అధికారులు, సిబ్బంది వార్డుల వారీగా దరఖాస్తుదారులను వారి ఇళ్ల వద్దకు వెళ్లి విచారించారు. విచారణ అనంతరం ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రాథమికంగా 4,492 మంది అర్హులుగా తేల్చారు. తేల్చిన జాబితాను కూడా హైదరాబాద్‌కు పంపించి ఆధార్‌తోపాటు ఫుడ్‌సెక్యూరిటీ కార్డుల ఆధారంగా గతంలో ఇందిరమ్మ ఇళ్లు పొందాడా లేదా అనే దానిపై తెలంగాణ సాంకేతిక సేవా సంస్థ ద్వారా విచారణ జరిపి మరికొందరిని తొలగించారు. ఫైనల్‌గా 4,205 మంది అర్హులుగా తేల్చారు.



నల్లగొండలో నిర్మించిన డబుల్‌బెడ్‌రూం ఇళ్లు

వార్డుకు 11 మందికి..

పట్టణంలోని 48 వార్డుల్లో ఒక్కో వార్డుకు 11 మంది చొప్పున డ్రా ద్వారా ఎంపిక చేస్తారు. డ్రాలో వచ్చిన ఆ 11 మంది కూడా నిజంగా అర్హులా కాదా అనేది రెండోసారి విచారణ జరిపి నిజంగా అర్హుడని తేలితేనే వారికి పట్టాలు అందించనున్నారు. ఎలాంటి పైరవీలకు, రాజకీయ ఒత్తిళ్లకు తావు లేకుండా డ్రా పద్ధతిన అర్హులకు ఇళ్లను అప్పగించనున్నారు.

లక్కీ డ్రాలు నిర్వహించే ప్రాంతాలు..

- 1, 2, 18, 19 వార్డులకు అమృతా గార్డెన్‌లో
- 3, 4, 5 వార్డులకు ఏమూరి గార్డెన్
- 20, 21, 22, 43 వార్డులకు ఎస్ఆర్‌గార్డెన్
- 6, 23, 24, 44 వార్డులకు అశోక గార్డెన్
- 7, 8, 9, 10 వార్డులకు జీఎం గార్డెన్
- 11, 12, 25, 26 వార్డులకు సపూర గార్డెన్
- 27, 28, 29, 30 వార్డులకు స్టార్ ఫంక్షన్‌హాల్
- 31, 32, 33, 34 వార్డులకు బండార్ గార్డెన్
- 13, 14, 15, 16, 17లకు శుభం కన్వెన్షన్ హాల్
- 35, 36, 37లకు చిన్నవెంకట్‌రెడ్డి ఫంక్షన్ హాల్
- 38, 39, 40, 48లకుపోలీస్ ఆడిటోరియం
- 41, 42, 45, 46, 47 టీఎన్‌జీఓస్ భవన్‌లో లక్కీడ్రాలు నిర్వహించి లబ్ధిదారులను ఎంపిక చేసి ఇళ్లను కేటాయించనున్నారు.

నేడు చిట్యాల మున్సిపల్ సమస్యలపై 'సాక్షి ఫోన్‌ఇన్'

ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు

చిట్యాల మున్సిపాలిటీ పరిధిలో కుక్కలు, కోతుల బెడదతో ఇబ్బందులు పడుతున్నారా.. తాగునీటి సరఫరా, పారిశుద్ధ్యం, వీధి దీపాల సమస్యలు ఎదుర్కొంటున్నారా.. అయితే మీ సమస్యలను నేరుగా మున్సిపల్ కమిషనర్‌కు తెలియజేయండి. మున్సిపల్ కమిషనర్‌తో శుక్రవారం 'సాక్షి' ఫోన్ ఇన్ కార్యక్రమం నిర్వహిస్తోంది.

సాక్షి ఫోన్‌ఇన్

ఫోన్ చేయాల్సిన నంబర్ : 93470 16142



మందడి రామదుర్గారెడ్డి, మున్సిపల్ కమిషనర్, చిట్యాల

మారిన పోలీస్ అధికారుల ఫోన్ నంబర్లు

- పాతవి తొలగింపు.. కొత్తవి కేటాయింపు
- ప్రజలకు అందుబాటులో ఉంచాలని ఎస్పీ అపూర్వరావు ఆదేశం

నల్లగొండ క్రైం: జిల్లా పోలీస్ శాఖలో అధికారుల ఫోన్ నంబర్లను మార్పుచేశారు. జిల్లా స్థాయి నుంచి ఎస్సై స్థాయి వరకు, పరిపాలన విభాగంలో పనిచేస్తున్న అధికారులకు కొత్త ఫోన్ నంబర్లను కేటాయించారు. కొత్త ఫోన్ నంబర్లను అన్ని పోలీస్ స్టేషన్లలో, సామాజిక మాధ్యమాల్లో ప్రజలకు అందుబాటులో ఉంచాలని ఎస్పీ అపూర్వరావు గురువారం ఒక ప్రకటనలో ఆదేశించారు. పోలీస్ అధికారులంతా ఈ నంబర్లపైనే అన్ని గ్రామాల్లోన్ని వాట్సాప్ గ్రూపుల్లో ఉంటే అందరికీ తెలుస్తుందని పేర్కొన్నారు. ఇక నుంచి ప్రజలు ఈ కొత్త ఫోన్ నంబర్ల ద్వారా సంబంధిత అధికారులను సంప్రదించవచ్చని సూచించారు.

కొత్త ఫోన్ నంబర్లు ఇవే..

ఎస్పీ	8712670200
అడిషనల్ ఎస్పీ	8712670201
మిర్యాలగూడ డీఎస్పీ	8712670206
దేవరకొండ డీఎస్పీ	8712670207
డీసీఆర్‌బీ డీఎస్పీ	8712670208
సీసీఎస్ డీఎస్పీ	8712670209
ఏఆర్ డీఎస్పీ	8712670211
సీసీ టు ఎస్పీ	8712670212
ఏఓ డీపీఓ	8712670216
పోలీస్ పీఆర్‌ఓ	8712670221

నల్లగొండ సబ్ డివిజన్..

సీఐ నల్లగొండ వన్‌టౌన్	8712670141
సీఐ నల్లగొండ టూటౌన్	8712670142
సీఐ నల్లగొండ మహిళా పోలీస్‌స్టేషన్	8712670143
సీఐ నల్లగొండ ట్రాఫిక్	8712670144
సీఐ నకిరేకల్	8712670145
సీఐ శాలిగౌరారం	8712670146
సీఐ చండూరు	8712670147
సీఐ నార్కట్‌పల్లి	8712670148
ఎస్సై శాలిగౌరారం	8712670178
ఎస్సై కట్టంగూర్	8712670179
ఎస్సై కేతేపల్లి	8712670180
ఎస్సై తిప్పర్తి	8712670181
ఎస్సై చండూరు	8712670182
ఎస్సై మునుగోడు	8712670183
ఎస్సై కనగల్	8712670184
ఎస్సై గట్టుప్పల్	8712670185
ఎస్సై నార్కట్‌పల్లి	8712670186
ఎస్సై చిట్యాల	8712670187

మిర్యాలగూడ సబ్ డివిజన్..

సీఐ మిర్యాలగూడ వన్‌టౌన్	8712670149
సీఐ మిర్యాలగూడ టూటౌన్	8712670150
సీఐ మిర్యాలగూడ రూరల్	8713670151
సీఐ హాలియా	8712670152
సీఐ సాగర్	8712670153
ఎస్సై మిర్యాలగూడ ట్రాఫిక్	8712670188
ఎస్సై మిర్యాలగూడ రూరల్	8712670189
ఎస్సై వేములపల్లి	8712670190
ఎస్సై వాడపల్లి	8712670191
ఎస్సై మాడ్గులపల్లి	8712670192
ఎస్సై అడివిదేవులపల్లి	8712670193
ఎస్సై హాలియా	8712670194
ఎస్సై నిడమనూర్	8712670195
ఎస్సై త్రిపురారం	8712670196
ఎస్సై విజయపురి	8712670197
ఎస్సై పెద్దవూర	8712670198
ఎస్సై తిరుమలగిరిసాగర్	8712670199

దేవరకొండ సబ్ డివిజన్..

సీఐ దేవరకొండ టౌన్	8712670154
సీఐ దేవరకొండ రూరల్	8712670155
సీఐ నాంపల్లి	8712670156
సీఐ కొండమల్లేపల్లి	8712670157
ఎస్సై డిండి	8712670223
ఎస్సై నేరడుగొమ్ము	8712670224
ఎస్సై చందంపేట	8712670225
ఎస్సై కొండమల్లేపల్లి	8712670226
ఎస్సై గుడిపల్లి	8712670227
ఎస్సై గుర్రంపోడు	8712670228
ఎస్సై నాంపల్లి	8712670229
ఎస్సై చింతపల్లి	8712670230
ఎస్సై మర్రిగూడ	8712670231

సీఐ ఐటీ సెల్ నల్లగొండ	8712670165
సీఐ షీటీం నల్లగొండ	8712670166
ఆర్ఐ ఎంటీఓ	8712670170

యాదాద్రీశుడికి శ్రీపుష్ప యాగం

యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి శ్రీపుష్ప యాగం కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. అనంతరం యాగ పుష్పాలతో స్వామి, అమ్మవారిని అలంకరించారు.



గొల్లకురుమ లబ్ధిదారులకు షాక్!

- పక్కదారి పడుతున్న గొర్రెల పంపిణీ పథకం
- ఒక్కో యూనిట్‌కు ఇస్తున్నవి పదిహేను గొర్రెలు.. ఐదు పిల్లలు.. ఒక పొట్టేలు
- అమ్మకందారుడికి రూ.1.20లక్షలు మాత్రమే ఇచ్చేలా ఒప్పందం
- యూనిట్ల అందజేతలో మధ్యవర్తులదే హవా

మునుగోడు మండలానికి చెందిన ఓ గొల్లకురుమ లబ్ధిదారుడికి గొర్రెల యూనిట్ మంజూరైంది. అతడు మధ్యవర్తుల ద్వారా అనంతపురం జిల్లాలో గొర్రెలను కొనుగోలు చేశాడు. అయితే, అతడికి సదరు రైతు మాత్రం లబ్ధిదారుడికి పదిహేను గొర్రెలు.. ఐదు పిల్లలు.. ఒక పొట్టేలు మాత్రమే ఇచ్చాడు. ఇదేమిటని అమ్మకందారుడిని అడిగితే నాకు ఇచ్చేది రూ.1.20లక్షలు మాత్రమేనని, మిగిలిన రూ.38వేలు తిరిగి మధ్యవర్తులకు ఇవ్వాలి. అందుకే ఆ డబ్బులకు సరిపడా 5పిల్లలు ఇస్తున్నామని చెప్పడంతో ఆ లబ్ధిదారుడు షాక్ తిన్నాడు.

మునుగోడు: రాష్ట్ర ప్రభుత్వం గొల్లకురుమల ఆర్థిక అభివృద్ధికి అమలు చేస్తున్న గొర్రెల పంపిణీ పథకం పక్కదారి పడుతోంది. నిబంధనల ప్రకారం యూనిట్‌కు 20గొర్రెలు, పొట్టేలును అందించాల్సి ఉన్నా మాంసం ధరలు పెరిగాయంటూ యూనిట్‌లో ఐదు గొర్రెలు తగ్గించి వాటి స్థానంలో పిల్లలను అంటగడుతున్నారని లబ్ధిదారులు వాపోతున్నారు.



ఇటీవల అనంతపురం జిల్లాలో ఓ లబ్ధిదారుడు కొనుగోలు చేసి తీసుకువచ్చిన గొర్రెలు

మధ్యవర్తులతో..

మధ్యవర్తులు లబ్ధిదారులను గొర్రెల అమ్మకందారుడి వద్దకు తీసుకెళ్లి బేరం ఆడిస్తున్నారు. ఆ యూనిట్‌కు ఎన్ని డబ్బులు ఇవ్వాలి అనే నిర్ణయం అంతా అక్కడే ఉన్న ఆ మధ్యవర్తులదే అని విశ్వసనీయంగా తెలిసింది. గతంలో జిల్లా చుట్టుపక్కల గల మాచర్ల, గుంటూరు జిల్లాల్లో గొర్రెలను కొనుగోలు చేసేవారు. అయితే వాటిని లారీలో తీసుకొచ్చి ఆ వెంటనే మరుసటి రోజు లేదా నాలుగు, ఐదు రోజుల తర్వాత ఆ అమ్మిన వ్యాపారి ఆ గొర్రెలను మళ్లీ కొనుగోలు చేసి తీసుకెళ్లేది. అయితే, ఇప్పుడు దాదాపు 500 కిలోమీటర్లకుపైగా దూరం ఉన్న అనంతపురం జిల్లాలో కొనుగోలు చేస్తుండడంతో తిరిగి అక్కడికి తీసుకెళ్లేందుకు రవాణా చార్జీలు అధికమవుతున్నాయని, అలా కాకుండా అమ్మే సమయంలో తమ కమీషన్ అధికంగా పొందేందుకు వ్యాపారులు 20గొర్రెలకు బదులుగా అందులో 15గొర్రెలు, 5పిల్లలను పెట్టి లబ్ధిదారులుకు ఇప్పిస్తున్నట్లు బహిరంగ ఆరోపణలు వినిపిస్తున్నాయి. అలా అమ్మిన రైతుకు ఒక్కో గొర్రెకు రూ.7వేల చొప్పున రూ.1.5లక్షలు, పొట్టేలుకు రూ.10వేలు, 5పిల్లలకు ఒక్కోదానికి రూ.2వేల చొప్పున రూ.10వేలతో కలిపి మొత్తం రూ.1.20లక్షల నుంచి రూ.1.25లక్షలు మాత్రమే ఇచ్చేలా మధ్యవర్తులు ఒప్పందం కుదుర్చుకుంటున్నారని ఆరోపణలు ఉన్నాయి. కొనుగోలు చేసిన లబ్ధిదారుడు తన బ్యాంక్ ఖాతా ద్వారా అమ్మిన రైతుకు ట్రాన్స్‌ఫర్ ఓచర్‌పై రూ.1.58లక్షలకు సంతకాలు పెట్టించి ఇస్తున్నారు. ఆ డబ్బులు అమ్మిన రైతు బ్యాంక్ ఖాతాలో జమైన తరువాత ఒప్పందం ప్రకారం రూ.1.20లక్షలు తీసుకుని మిగిలిన రూ.30వేల నుంచి రూ.35వేలు ఆ వ్యాపారికి ఇస్తున్నట్లు సమాచారం. అందులో రూ.20వేలకు పైగా సంబంధిత శాఖ నిర్వాహకులకు అప్పగించేలా ఒప్పందాలు కుదుర్చుకున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. దీంతో తమకు పథకం కింద పూర్తి ప్రయోజనం చేకూరడం లేదని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఏడు మండలాలకు 7,400 యూనిట్లు

మునుగోడు నియోజకవర్గంలోని ఏడు మండలాలకు 7,400 యూనిట్లు మంజూరయ్యాయి. అయితే, ప్రభుత్వం ఇటీవల మునుగోడు, చండూరు మండలాల్లోని లబ్ధిదారులకు యూనిట్లను మంజూరు చేస్తోంది. కాగా, మునుగోడు, చండూరులో లబ్ధిదారులకు పంపిణీ చేసిన 193 యూనిట్లను ఇదే తరహాలో అంటగట్టినట్లు తెలిసింది.

మధ్యవర్తులను ఆశ్రయించొద్దు

గొర్రెల కొనుగోలు విషయంలో పూర్తి లబ్ధిదారుడికి పూర్తి స్వేచ్ఛ ఇచ్చాం. గొర్రెలు అమ్మే వారి వద్దకు వెళ్లి లబ్ధిదారులు నచ్చిన వి కొనుగోలు చేస్తే అప్పుడు మా వైద్యులు అవి ఆరోగ్యంగా ఉన్నాయ లేదా పరిశీలించి ట్యాగ్ వేసి పంపిస్తున్నారు. మాంసం ధరలు పెరిగిన కారణంగా గొర్రెల అమ్మకందారులు ధరలు పెంచి అమ్ముతునట్లు తమ దృష్టికి వచ్చింది. రైతులకు నచ్చకపోతే మరో చోట కొనుగోలు చేయాలి. కానీ మధ్యవర్తులని ఏ ఒక్కరూ ఆశ్రయించవద్దు.

–డాక్టర్.యాదగిరి,
జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి

క్లుప్తంగా

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

మిర్యాలగూడ: విద్యుదాఘాతంతో వ్యక్తి మృతిచెందిన ఘటన మాడ్గులపల్లి మండలంలోని ఆగామోత్కూర్ గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం .. ఆగామోత్కూర్ గ్రామానికి చెందిన కోల రాములు(62) బుధవారం రాత్రి తన కిరాణ దుకాణంలో ఫ్రిడ్జ్ డోర్‌తీస్తుండగా విద్యుదాఘాతానికి గురై కిందపడిపోయాడు. దీంతో అక్కడే ఉన్న కోల జానయ్య వెంటనే రాములును మిర్యాలగూడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. మృతుడికి ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. మృతుడి కుమార్తె దొనేటి మణెమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ నరేష్ తెలిపారు.

బొమ్మలరామారంలో మరొకరు



సత్యనారాయణ (ఫైల్)

బొమ్మలరామారం: విద్యుదాఘాతంతో వ్యక్తి మృతిచెందిన ఘటన బొమ్మలరామారం మండలంలో గురువారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మైలారం గ్రామానికి చెందిన ఇండ్ల సత్యనారాయణ(55) గ్రామ సమీపంలోని షామీర్‌పేట్ వాగు వైపు వెళ్లాడు. వాగులో ఎవరో గుర్తుతెలియని వ్యక్తులు చేపలు పట్టడానికి విద్యుత్ వైర్లు వేసి ఉంచారు. ఇది గమనించని సత్యనారాయణ కరెంట్ వైర్ తగలడంతో విద్యుదాఘాతంతో అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న ఎస్‌ఐ వెంకన్న ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతుడి కుమారుడు కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఏపీ నుంచి ఇసుక రవాణా

- ఆంధ్రప్రదేశ్ నుంచి తెలంగాణలోకి అక్రమంగా తరలింపు
- చెక్‌పోస్టులు తప్పించుకునేందుకు గ్రామాల మీదుగా వస్తున్న లారీలు
- మామూళ్లు తీసుకుని పోలీసులే సహకరిస్తున్నారని ఆరోపణలు
- ఫిర్యాదులు వస్తే నామమాత్రంగా కేసులు నమోదు



ఇసుక తరలిస్తూ వారం క్రితం పట్టుబడిన లారీ



నంబర్ ప్లేట్ లేని టిప్పర్‌లో హైదరాబాద్‌కు ఇసుక తరలిస్తున్న అక్రమార్కులు

కోదాడరూరల్: ఆంధ్రప్రదేశ్ నుంచి తెలంగాణలోకి జోరుగా ఇసుక అక్రమ రవాణా అవుతోంది. రాత్రికి రాత్రే టిప్పర్‌లు, లారీలు ఆంధ్రప్రదేశ్ నుంచి తెలంగాణ సరిహద్దు గ్రామాల మీదుగా కోదాడ, హైదరాబాద్‌కు చేరుకుంటున్నాయి. ఈ విషయం తెలిసిన ఓ పోలీస్ అధికారి టిప్పర్, లారీకి వేర్వేరుగా రేటు మాట్లాడుకొని ఇసుక వ్యాపారుల దందాకు సహకరిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇటీవల ఈ దందా ఎక్కువ కావడంతో కొందరి ఫిర్యాదుల మేరకు తూతూమంత్రంగా కేసులు నమోదు చేసి చేతులు దులుపుకున్నారనే విమర్శలు కూడా వచ్చాయి. కోదాడలోని కొందరు వ్యాపారులు ఎలాంటి అనుమతులు తీసుకోకుండా ఆంధ్రప్రదేశ్‌లోని ఎన్టీఆర్ జిల్లా నందిగామ, కంచికచర్లలో కొందరు వ్యాపారులతో చేతులు కలిపి ఈ దందా కొనసాగిస్తున్నట్లు తెలుస్తోంది. ఇక ఈ ఇసుకను రవాణా చేస్తున్న వాహనాల్లో కొన్నింటికి నంబర్ ప్లేట్లు కూడా లేకపోవడం గమనార్హం.

సరిహద్దు గ్రామాల మీదుగా..

ఆంధ్రప్రదేశ్‌లోని ఎన్టీఆర్ జిల్లా నందిగామ, కంచికచర్ల ప్రాంతాల్లోని వాగుల నుంచి ఈ ఇసుక వ్యాపారం సాగుతుంది. అక్కడి ప్రభుత్వం డీడీలు తీస్తే ఇసుక రీచ్‌లను బట్టి రూ.450 నుంచి రూ.800 వరకు విక్రయిస్తుంది. అయితే అక్కడి ప్రధాన వాగుల్లో ప్రస్తుతం నీటి ప్రవాహం లేకపోవడంతో కొందరు వ్యాపారులు రీచ్‌ల నుంచి కాకుండా వేరే చోట్ల నుంచి రాత్రి సమయాల్లో జేసీబీలతో ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను తవ్వి టిప్పర్‌లు, లారీల ద్వారా ఇసుకను తెలంగాణలోకి రవాణా చేస్తున్నారు. అయితే ఈ వాహనాలు తెలంగాణలోని కోదాడకు రావాలంటే విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారిపై రెండు రాష్ట్రాల సరిహద్దుల్లో ఉన్న అటు చిల్లకల్లు, ఇటు చిమిర్యాల చెక్‌పోస్టులను దాటి రావాల్సి ఉంది. ఈ మార్గంలో వస్తే చెక్‌పోస్ట్ సిబ్బంది పట్టుకుంటారనే భయంతో ఆ వాహనాలను ఏపీలోని జగ్గయ్యపేట మీదుగా దొండపాడు, అన్నారం, రెడ్లకుంట, కాపుగల్లు, గుడిబండ గ్రామాల మీదగా కోదాడకు తరలిస్తున్నారు. ఇలా వచ్చిన ఇసుకను తెల్లవారుజామునే వేబ్రిడ్జి కాంటాపెట్టి కొందరు కోదాడతో పాటు పరిసర ప్రాంతాల్లో విక్రయిస్తుండగా మరికొందరు హైదరాబాద్ తరలిస్తున్నారు.

భారీగా వసూళ్లు

ఈ అక్రమ ఇసుక దందాకు సహకరించేందుకు ఓ పోలీస్ అధికారి భారీగా వసూళ్లకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయితే కొందరి వద్ద నెల నెలా మామూళ్ల లెక్కన మాట్లాడుకోగా, మరికొందరి వద్ద లారీ, టిప్పర్‌కి వేర్వేరుగా రేటు మాట్లాడుకుని ఇసుకను తరలించేందుకు సహకరిస్తున్నట్లు తెలుస్తోంది.

తక్కువ రేటుకు విక్రయిస్తూ..

ఇలా అక్రమంగా తక్కువ రేటుకు తీసుకొచ్చిన ఇసుకను ఆ వ్యాపారులు టన్ను రూ.900 నుంచి రూ.1000 వరకు విక్రయిస్తున్నారు. అయితే అన్ని అనుమతులు తీసుకొని డీడీలు చెల్లించి ఇసుక వ్యాపారం చేస్తున్న మరికొందరు ఈ ధరకు అమ్మితే తమకు గిట్టుబాటు కావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అక్రమ వ్యాపారం చేసే వారిపై చర్యలు తీసుకోవాలని ఇసుక వ్యాపారులు కోరుతున్నారు.

కేసులు నమోదు చేస్తున్నాం



ఆంధ్రప్రదేశ్ నుంచి తెలంగాణలోకి అక్రమంగా వస్తున్న ఇసుక లారీలు, టిప్పర్‌లపై ఇప్పటికే కేసులు నమోదు చేశాం. ఇసుక అక్రమంగా రవాణా చేసే వారిపై ఫిర్యాదు చేస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటాం. ఇసుక అక్రమ రవాణాలో పోలీసుల సహకారం ఉందనే ఆరోపణలు అవాస్తవం.

– వెంకటేశ్వరరెడ్డి, డీఎస్పీ, కోదాడ

వైభవంగా చక్రతీర్థం.. దోపోత్సవం

- కొనసాగుతున్న యాదాద్రి బ్రహ్మోత్సవాలు
- మహాపూర్ణాహుతి, దేవతోద్వాసన, పుష్పయాగం నిర్వహించిన ఆచార్యులు
- నేడు శతఘటాభిషేకం, శృంగార డోలోత్సవంతో ఉత్సవాలు ముగింపు



మహాపూర్ణాహుతి నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట: యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఈ ఉత్సవాలలో భాగంగా గురువారం ఉదయం ప్రధానాలయంలో ఆచార్యులు నిత్యారాధనలు, ప్రభాతబేరీ, విష్ణుసహస్ర నామ పారాయణాలు జరిపించారు. అనంతరం ఉదయం 10.30గంటలకు మహా పూర్ణాహుతి కార్యక్రమాన్ని చేపట్టారు. 11.30గంటలకు మహావిష్ణువు ఆయుధమైన శ్రీచక్ర ఆళ్వారుడికి, ఉత్సవమూర్తులకు విశేష పూజలు చేసి కొండపై గల విష్ణు పుష్కరిణిలో చక్రతీర్థం చేపట్టారు. అంతకుముందు ఆలయ ప్రథమ ప్రాకార మండపంలో ఉత్సవమూర్తులు, శ్రీచక్ర ఆళ్వారుడిని ప్రత్యేక పల్లకీపై అధిష్ఠింపజేసి పూజలు చేసి సుదర్శ నారసింహ అలంకారంలో ఆలయ మాఢ వీధుల్లో ఊరేగిస్తూ విష్ణు పుష్కరిణి వద్దకు తీసుకొచ్చి శుద్ధమైన జలంలో స్నానం చేయించారు. అనంతరం ఆలయ ఆచార్యులు, అధికారులు పుష్కరిణిలో స్నానం ఆచరించారు. విష్ణు పుష్కరిణిలో పూజించిన శుద్ధ చక్రతీర్థ జలాన్ని ప్రచార రథంలో ఊరేగింపుగా తీసుకెళ్లి కొండ కింద లక్ష్మీ పుష్కరిణిలో కలిపారు. అనంతరం భక్తులు పెద్దఎత్తున అందులో పుణ్య స్నానాలు ఆచరించారు. బ్రహ్మోత్సవాలలో భాగంగా సాయంత్రం నిత్యారాధనల అనంతరం పాంచరాత్ర ఆగమ శాస్త్రానుసారం ఆచార్యులు దేవతోద్వాసన, శ్రీపుష్పయాగం, దోపోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో ఆలయ ఈఓ గీతారెడ్డి, అనువంశిక ధర్మకర్త బి. నర్సింహమూర్తి, ప్రధానార్చకులు, యాజ్ఞీకులు, రుత్వికులు, ఆచార్యులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయంలో నేడు

బ్రహ్మోత్సవాల్లో చివరి రోజైన శుక్రవారం ఉదయం 10గంటలకు అష్టోత్తర శతఘటాభిషేకం జరిపించనున్నారు. రాత్రి 9గంటలకు శృంగార డోలోత్సవం నిర్వహించి ఉత్సవాలను పరిసమాప్తం చేయనున్నారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు..

బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం యాదగిరిగుట్టకు చెందిన శ్రీవైష్ణవ సేవా సమాఖ్య వారిచే ప్రభాత భేరీ, భూదాన్‌పోచంపల్లికి చెందిన శ్రీలక్ష్మీనారాయణ భజన మండలి, యాదగిరిగుట్ట పట్టణానికి చెందిన శ్రీభాగ్యలక్ష్మీ భక్త భజన మండలిచే భజన నిర్వహించారు. అనంతరం ఆస్థాన మంగళవాయిద్యం, ఆస్థాన వైదిక ప్రార్థనలు, నృసింహతత్వంపై కేవీ నరసింహచార్యులు ఉపన్యాసం గావించారు. విరాట పర్వం హరికథను ముదపాక బాలసుందరం, భాగవతార్ గానం చేశారు. సాయంత్రం సుస్వర ఆకాడమీచే భక్తీ సంగీతం, బృందావని బృందం, సాంస్కృతిక కళామండలి బృందం, కూమారి లహరి బృందం, హరిత బృందం, కుమారి నాగదుర్గ బృందంలచే కూచిపూడి నృత్య ప్రదర్శన ఇచ్చారు. రాత్రి నూక జగదీశ్వరిచే ప్రధానాలయంలో భక్తి సంగీతం, శ్రీలక్ష్మీనారాయణ భాగవతార్‌చే దోపు కథను నిర్వహించారు.



ఆలయంలో దేవతోద్వాసన పూజ నిర్వహిస్తున్న ఆచార్యులు



కొండ కింద లక్ష్మీపుష్కరిణిలో స్నానాలు చేస్తున్న భక్తులు

కుటుంబ కలహాలతో మహిళ ఆత్మహత్య

కట్టంగూర్: కుటుంబ కలహాలతో మనస్తాపానికి గురైన మహిళ ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని పరడ గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పరడ గ్రామానికి చెందిన స్వాతి(27)కి అదే గ్రామానికి చెందిన పరడ మహేష్‌తో మూడేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఒక పాప సంతానం. భర్తతో మనస్పర్థల కారణంగా స్వాతి కొంతకాలంగా గ్రామంలోని తన తల్లిగారి ఇంట్లో ఉంటుంది. మూడు నెలల క్రితం పెద్దమనుషుల సమక్షంలో విడాకులు తీసుకునేందుకు ఇరు కుటుంబాలు ఒప్పందం చేసుకున్నారు. ఈ క్రమంలో మనస్తాపానికి గురైన స్వాతి గురువారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇనుప పైపుకు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ విజయ్‌కుమార్ తెలిపారు.

రసాయన ట్యాంకర్ పట్టివేత

చౌటుప్పల్: మండల పరిధిలోని కొయ్యలగూడెంలో గల ఎస్‌వీ ల్యాబ్ వద్ద స్థానికులు గురువారం రసాయన ట్యాంకర్‌ను పట్టుకున్నారు. పరిశ్రమ నుంచి ప్రమాదకరమైన వ్యర్థ రసాయనాలను తరలిస్తుందన్న అనుమానంతో స్థానికులు ట్యాంకర్‌ను అడ్డుకున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని ట్యాంకర్‌ను స్టేషన్‌కు తరలించారు. ట్యాంకర్‌లో ఉన్నది రసాయనాలా లేక వ్యర్థ రసాయనాలా అనేది గుర్తించేందుకు కాలుష్య నియంత్రణ మండలి అధికారులకు సమాచారం ఇచ్చినట్లు సీఐ మల్లికార్జున్‌రెడ్డి తెలిపారు.

'డబుల్' దరఖాస్తుదారుల పడిగాపులు

- దేవరకొండలో 484 డబుల్ బెడ్‌రూం ఇళ్లకు లబ్ధిదారుల ఎంపిక చేపట్టిన అధికారులు
- డ్రా పద్ధతిలో అర్ధరాత్రి వరకు కొనసాగిన ప్రక్రియ



డ్రా పద్ధతిన లబ్ధిదారులను ఎంపిక చేస్తున్న ఆర్డీఓ గోపిరాం



మున్సిపల్ కార్యాలయం ఆవరణలో ఎదురుచూస్తున్న డబుల్ బెడ్‌రూం ఇళ్ల దరఖాస్తుదారులు

దేవరకొండ: పట్టణంలోని 20 వార్డులకు సంబంధించి పట్టణ శివారులో ప్రభుత్వం 544 డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణం చేపట్టింది. కాగా వీటిలో 60 ఇళ్లను మండల పరిధిలోని కొండభీమనపల్లి గ్రామస్తులకు కేటాయించగా మిగిలిన 484 ఇళ్లకు సంబంధించి గురువారం రాత్రి దేవరకొండ ఆర్డీఓ గోపిరాం ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయంలో డ్రా పద్ధతిన లబ్ధిదారుల ఎంపిక నిర్వహించారు. ఆయా వార్డులకు చెందిన 1725 మంది దరఖాస్తు చేసుకున్నారు. కాగా గత వారం రోజులుగా రెవెన్యూ అధికారులు వార్డుల వారీగా సర్వే నిర్వహించి దరఖాస్తులను పరిశీలించారు. ఇందులో 585 మందిని అర్హులుగా గుర్తించినట్లు ఆర్డీఓ పేర్కొన్నారు. రిజర్వేషన్ ప్రాతిపదికన ఎస్సీలకు 82, ఎస్టీలకు 29, మైనార్టీలకు 58, ఇతరులకు 315 చొప్పున ఇళ్లు కేటాయించి ఎంపిక ప్రక్రియ చేపట్టారు. లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ అర్ధరాత్రి వరకు కొనసాగడంతో దరఖాస్తుదారులు పడిగాపులు కాసారు. కార్యక్రమంలో డీఏఓ సంఘమిత్ర, దేవరకొండ తహసీల్దార్ రాజు, ఆయా మండలాల తహసీల్దార్లు, ఆర్‌ఐలు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తప్పని నిరీక్షణ..

డబుల్ బెడ్‌రూం ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ సాయంత్రం 5గంటలకు ప్రారంభం కావాల్సి ఉండగా వివిధ కారణాలతో రాత్రి 8గంటల తర్వాత ప్రారంభమైంది. లబ్ధిదారుల ఎంపిక చేపడుతున్నట్లు తెలియడంతో ఆయా వార్డులకు చెందిన దరఖాస్తుదారులు పెద్దఎత్తున దేవరకొండ ఆర్డీఓ కార్యాలయానికి చేరుకున్నారు. అక్కడి నుంచి మున్సిపల్ కార్యాలయానికి వచ్చారు. దాదాపు ఐదు గంటల వరకు దరఖాస్తుదారులు కార్యాలయ ఆవరణలో నిరీక్షించాల్సి వచ్చింది. ఇదిలా ఉంటే డబుల్ బెడ్‌రూం ఇళ్ల ఎంపిక ప్రక్రియలో అవకతవకలు జరిగాయని, మొదట్లో అర్హులుగా చూపిన వారిని తర్వాత అనర్హులుగా చూపారని పలువురు ఆరోపించారు. దరఖాస్తుదారుల ఎంపిక నేపథ్యంలో దేవరకొండ సీఐ శ్రీనివాసులు ఆధ్వర్యంలో బందోబస్తు చేపట్టారు.

వేర్వేరు చోట్ల నలుగురు అదృశ్యం



రమాదేవి

తిరుమలగిరి(నాగార్జునసాగర్): మండల పరిధిలోని అల్వాల గ్రామానికి చెందిన కంచర్ల రమాదేవి అదృశ్యమైనట్లు గురువారం ఫిర్యాదు అందిందని ఎస్‌ఐ బాబు పేర్కొన్నారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల ప్రకారం.. రమాదేవి ఫిబ్రవరి 28న ఎవరికీ చెప్పకుండా ఇంటి నుంచి వెళ్లి తిరిగిరాలేదు. కుటుంబ సభ్యులు ఎంత వెతికినా ఆచూకీ లభించకపోవడంతో గురువారం రమాదేవి తల్లి సైదమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

రామన్నపేటలో వ్యక్తి..



శంకర్

రామన్నపేట: మండల కేంద్రంలోని వడ్డెరవాడకు చెందిన గజరాజు శంకర్(52) రెండు రోజుల క్రితం అదృశ్యమైనట్లు స్థానిక ఎస్‌ఐ ఎం. లక్ష్మయ్య గురువారం తెలిపా రు. శంకర్ మంగళవారం సాయంత్రం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదని, ఎంత వెతికినా శంకర్ ఆచూకీ లభించకపోవడంతో అతడి కుమారుడు సాయి బుధవారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసిన దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. శంకర్ ఆచూకీ తెలిసిన వారు 9490617537 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు.

భువనగిరిలో ఒకరు..



వెంకటేష్

భువనగిరి : మండలంలోని వీరవెల్లి గ్రామానికి చెందిన ఓ వ్యక్తి అదృశ్యమయ్యాడు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వీరవెల్లి గ్రామానికి చెందిన నల్లమాస వెంకటేష్ భార్యతో తరచూ గొడవపడేవాడు. ఈ క్రమంలో ఫిబ్రవరి 28న మధ్యాహ్నం ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బైక్‌పై ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు ఎంత వెతికినా ఆచూకీ లభించకపోవడంతో గురువారం అతని తండ్రి మల్లయ్య పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్సై రాఘవేందర్‌గౌడ్ తెలిపారు.

మఠంపల్లిలో మహిళ..



పూలమ్మ

మఠంపల్లి: మండల కేంద్రానికి చెందిన కుంభం పూలమ్మ (54) ఫిబ్రవరి 28వ తేదీ నుంచి కనిపించకుండాపోయిందని ఆమె భర్త కుంభం లింగయ్య గురువారం మఠంపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పూలమ్మ మానసికస్థితి సరిగాలేదని, ఆమె ఎవరికీ చెప్పకుండా ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదని ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ఇరుగు రవి తెలిపారు.